సాక్షి సంగారెడ్డి

శుక్రవారం । 28 । మార్చి । 2025


I



రైతులకు ప్రత్యేక గుర్తింపు

ప్రతీ రైతుకు ప్రత్యేక గుర్తింపు కార్డును ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.


వివరాలు IIలో ▸



ధర లేక రైతన్న దిగాలు

పుచ్చకాయల ధరలు భారీగా తగ్గడంతో ఆ పంట పండించిన రైతులు తీవ్ర నష్టాలు ఎదుర్కొంటున్నారు.

వివరాలు IIIలో ▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
శుక్రవారం సా. 6.35 గం.	శనివారం ఉ. 4.51 గం.

న్యూస్‌రీల్

ఘనంగా శ్రీపాండురంగ ఆలయ వార్షికోత్సవం



నిండు కలశాలతో మహిళలు



రాయికోడ్(అందోల్): రాయికోడ్‌లోని శ్రీరుక్మిణీ పాండురంగ ఆలయ 14వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా అర్చకులు శ్రీరుక్మిణీదేవి పాండురంగేశ్వరులకు అభిషేకం,ప్రత్యేక పూజలు చేశారు. ప్రతేకంగా అలంకరించిన వాహనంపై ఉత్సవ విగ్రహాలను ఉంచి డప్పుచప్పుళ్ల మధ్య పిల్లలు,పెద్దలు,యువకులు భజన చేస్తూ, నృత్యాలు చేస్తూ గ్రామ పురవీధుల గుండా శోభయాత్ర నిర్వహించగా మహిళలు నిండు కలశాలతో విచ్చేశారు. ఆలయం లోశ్రీరుక్మిణి పాండురంగడికి మహాహారతి ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలను వితరణ చేశారు.

ఎన్‌హెచ్‌ఆర్‌సీ జిల్లా చైర్మన్‌గా వినాయక్ పవార్



జహీరాబాద్ టౌన్: జాతీయ మానవ హక్కుల కమిటీ(ఎన్‌హెచ్‌ఆర్‌సీ)జిల్లా చైర్మన్‌గా జహీరాబాద్‌కు చెందిన వినాయక్ పవార్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు మహ్మద్ యాసీన్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వినాయక్ పవార్ మాట్లాడుతూ... ప్రజల సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషిచేస్తానని చెప్పారు.

ఐలా నూతన కార్యవర్గం ఎన్నిక

పటాన్‌చెరు: పటాన్‌చెరు పారిశ్రామికవాడలో ఐలా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అయితే చైర్మన్ పదవికి సుధీర్‌రెడ్డిపై పోటీ చేసిన చంద్రశేఖర్‌రెడ్డి అనర్హతకు గురి కావడంతో సుధీర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నియ్యారు. వైస్ చైర్మన్ పదవికి పోటీ ఉండటంతో గురువారం టీఎస్ఐఐసీ కార్యాలయంలో ఎన్నికల నిర్వహించారు. దీనిలో 134 ఓట్లు పోలవగా ప్రభాకర్‌పై, శ్రీను 112 ఓట్ల తేడాతో గెలుపొందారు. అలాగే జనరల్ సెక్రటరీగా కుటుంబరావు, కోశాధికారిగా సురేందర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీగా మురళి, సభ్యులు శ్రీశైలం, బసవరావు, శంకర్, శ్రీనివాసరావు, నారాయణరెడ్డి, గంగోత్రి శ్రీనివాస్, శ్రీదేవిలను ఎన్నుకున్నారు.

ఎస్పీ దంపతుల ప్రత్యేక పూజలు

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి పట్టణ శివారులోని శ్రీ వైకుంఠపురంలో ఎస్పీ పరితోష్ పంకజ్ దంపతులు గురువారం శ్రీవెంకటేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ దంపతులను దేవాలయ ప్రధాన అర్చకులు వరదాచార్యులు సన్మానించారు. దేవాలయ విశిష్టత గురించి ఎస్పీకి వివరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఇఫ్తార్



చిన్నారికి ఖర్జూర పండును తినిపిస్తున్న ఎస్పీ పరితోష్ పంకజ్

సంగారెడ్డి జోన్: సంగారెడ్డి పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో పోలీసు శాఖ ఆధ్వర్యంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు గురువారం రాత్రి ఇఫ్తార్‌ను ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు ఎస్పీ సంజీవరావు హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఉపవాస దీక్షను విరమించారు. ఈ సందర్భంగా చిన్నారులకు, అధికారులకు ఎస్పీ పరితోష్ ఖర్జూర పండును తినిపించారు.

సంగారెడ్డి 'బార్' అధ్యక్షుడిగా విష్ణువర్ధన్‌రెడ్డి

వరుసగా మూడోసారి ఎన్నిక

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి బార్ అసోసియేషన్‌లో జరిగిన ఎన్నికల్లో 9వసారి అధ్యక్షుడిగా విష్ణువర్ధన్‌రెడ్డి విజయ ఢంకా మోగించారు. ఉపాధ్యక్షుడిగా భూపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వి.మహేశ్, సంయుక్త కార్యదర్శిగా ఎస్. మల్లేశం, కోశాధికారిగా శ్రీకాంత్, క్రీడల కార్యదర్శిగా టి.శ్రీనివాస్, గ్రంథాలయ కార్యదర్శిగా నిజాముద్దీన్ రషీద్, మహిళా ప్రతినిధిగా మంజులారెడ్డి, కార్యవర్గ సభ్యులుగా బుచ్చయ్య, సుభాష్ చందర్, నరసింహ, మాణిక్‌రెడ్డి, రాములు, ఎం.దత్తాత్రి, భాస్కర్ విజయం సాధించారు.

క్రమబద్ధీకరణ కష్టాలు

ఒక్కప్లాటు కోర్టు కేసులో ఉన్నా.. సర్వే నంబర్‌లోని అన్ని ప్లాట్లు నిషేధిత జాబితాలోకి..



ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి కిషన్‌రావు జోషి. సంగారెడ్డి మండలం ఫసల్‌వాదిలో ఓ అనధికారిక లేఅవుట్‌లో 150 గజాల ప్లాట్‌ను 2018లో కొనుగోలు చేశాడు. ఇప్పుడు ఎల్‌ఆర్‌ఎస్ స్కీం కింద తన ప్లాటును క్రమబద్ధీకరించుకునేందుకు ప్రయత్నించగా..ఎల్‌ఆర్‌ఎస్ వెబ్‌సైట్ సిటిజన్ లాగిన్ చేస్తే ప్రొహిబిటెడ్ అని చూపిస్తోంది. స్థానిక అధికారులకు సంప్రదించగా సరైన సమాచారం దొరకలేదు. సంగారెడ్డి కలెక్టరేట్‌కు వచ్చి అధికారులను సంప్రదించగా.. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి ఎన్‌ఓసీ (నిరభ్యంతర పత్రం) తీసుకురావాలని చెప్పారు. దీంతో జోషి రిజిస్ట్రేషన్ కార్యాలయానికి పరుగులు పెట్టారు.

రామచంద్రాపురానికి చెందిన లక్ష్మణ్ (పేరు మార్చాం). మండలంలోని పటాన్‌చెరు మండలంలో ఓ అనధికారిక లేఅవుట్‌లో ప్లాటు కొనుగోలు చేశారు. ప్రజావసరాల కోసం గ్రామపంచాయతీకి వదలాల్సిన 10% భూమిని కూడా వెంచర్ వేసిన అక్రమార్కుడు ప్లాట్లుగా చేసి విక్రయించి సొమ్ము చేసుకున్నాడు. కానీ లక్ష్మణ్ మాత్రం 10% ల్యాండ్‌కు సంబంధించిన ఓపెన్‌స్పేస్ చార్జీలు 14% చెల్లించాల్సి వస్తోంది. ఓపెన్ స్పేస్ అసలు లేకపోయినప్పటికీ ఈ ఓపెన్‌స్పేస్ చార్జీలను తాను ఎందుకు చెల్లించాలని లక్ష్మణ్ వాపోతున్నారు.

- కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న దరఖాస్తుదారులు
- వెంచర్‌లో ఖాళీ స్థలాలు లేకపోయినా ఓపెన్‌స్పేస్ చార్జీలు కట్టాల్సిందే
- ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల ప్రక్రియ తీరు..
- మిగతాచోట్ల అంతంతమాత్రం స్పందన

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: ఈ ఇక్కట్లు కిషన్‌రావు, లక్ష్మణ్‌లదే కాదు. తమ ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు ముందుకొస్తున్న వేలాది మంది దరఖాస్తుదారులు ఇలాంటి సమస్యలే ఎదుర్కొంటున్నారు. ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిన విషయం విదితమే. మార్చి 31లోపు ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లిస్తే 25% డిస్కౌంట్ ఇస్తామని పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు వేసి ప్రచారం చేస్తోంది. కానీ ఈ ఎల్‌ఆర్‌ఎస్ చెల్లించేందుకు క్షేత్రస్థాయిలో దరఖాస్తుదారులు ఇబ్బందులు పడుతున్నారు. తమ సమస్య లెవల్-1 స్థాయి అధికారుల వద్ద పరిష్కారమవుతుందా.. లెవల్-2 అధికారుల పరిధిలోకి వస్తుందా..? లెవల్ -3 అధికారుల వద్దకు వెళ్లాలా తెలియక తికమకపడుతున్నారు. ఆయా కార్యాలయాల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు.

నిషేధిత జాబితా కష్టాలు..

ఒక లేఅవుట్‌లోని సర్వేనంబర్‌లో 200 ప్లాట్లు ఉంటే.. అందులో ఒకటీ.. రెండు ప్లాట్లు కోర్టు కేసుల్లో ఉంటే.. ఆ సర్వే నంబర్‌లోని అన్ని ప్లాట్లను నిషేధిత (ప్రొహిబిటెడ్) జాబితాలో చూపిస్తోంది. దీంతో ఏం చేయాలో తెలియక చాలామంది దరఖాస్తుదారులు మున్సిపాలిటీ, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. సంబంధిత సబ్ రిజిస్ట్రార్ నుంచి ఎన్‌ఓసీ తీసుకుని ఎల్-1 స్థాయి అధికారులను కలిస్తే సమస్య పరిష్కారమవుతుందని అధికారులు చెబుతున్నారు.

కనిపించని ఓపెన్‌స్పేస్‌లు..

అనధికారిక వెంచర్లు వేసిన అక్రమార్కులు చాలా చోట్ల ప్రజా అవసరాల కోసం కేటాయించాల్సిన 10% స్థలాలను (టెన్ పర్సెంట్ ల్యాండ్)లను ప్లాట్లుగా చేసి సొమ్ము చేసుకున్నారు. ఆయా కాలనీల్లో బడి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పార్కు వంటి వాటి నిర్మాణం కోసం ఈ స్థలాలను కేటాయించాలి. నిబంధనల ప్రకారం ఈ 10% భూమిని సంబంధిత మున్సిపాలిటీగానీ, గ్రామపంచాయతీ తన అధీనంలోకి తీసుకోవాలి. కానీ అధికారులు వెంచర్ నిర్వాహకులతో చేతులు కలపడంతో ఈ ప్రజావసరాల ల్యాండ్ కూడా పరాధీనమైపోయింది. కానీ, ఈ అనధికారిక లేఅవుట్‌లో ప్లాటు కొన్నందుకు లేని ఓపెన్ స్పేస్‌కు చార్జీలు చెల్లించాల్సిన పరిస్థితి దరఖాస్తుదారులకు ఏర్పడింది.

డాక్యుమెంట్స్ షార్ట్‌ఫాల్ పేరుతో...

ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియలో చాలామందికి డాక్యుమెంట్ షార్ట్‌ఫాల్ అని వెబ్‌సైట్‌లో చూపుతోంది. అయితే ఏ డాక్యుమెంట్ అవసరమో సాధారణ దరఖాస్తుదారులకు తెలియడం లేదు. సేల్‌డీడ్, ఈసీ, లింక్‌డాక్యుమెంట్లు, లేఅవుట్‌కాపీ డాక్యుమెంట్లు అవసరం ఉంటాయి. వీటిని నిర్ణీత సైజులో స్కాన్ చేసి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. అయితే అంతగా అవగాహన లేని వారికి ఈ సాంకేతిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. ఆయా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ వివరాలిలా...

వచ్చిన దరఖాస్తులు:	90,546
అప్రూవ్ అయినవి:	54,315
ఫీజు చెల్లించినవి:	8,829
ఇంకా ఫీజు చెల్లించాల్సినవి:	45,514



మండల స్థాయి హెల్ప్‌డెస్క్‌ల్లో సమాచారం అంతంతే..

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారంలో ఎదురయ్యే ఇబ్బందులను పరిష్కరించేందుకు ప్రభుత్వం అన్ని మండలాల్లో ఎంపీడీఓ కార్యాలయాలు, మున్సిపాలిటీ కార్యాలయాల్లో హెల్ప్‌డెస్కులు ఏర్పాటు చేశారు. ఈ డెస్క్‌ల్లో పనిచేస్తున్న సిబ్బందికి చాలామందికి ఎల్‌ఆర్‌ఎస్ వెబ్‌సైట్‌లో ఉన్న సాంకేతిక అంశాలపై పూర్తి స్థాయిలో అవగాహన ఉండటం లేదు. వీరికి శిక్షణ ఇచ్చినప్పటికీ.. చాలామందిలో అవగాహన అంతంత మాత్రంగానే ఉంటోంది. దీంతో ఆయా మున్సిపాలిటీల నుంచి, మండలాల నుంచి దరఖాస్తుదారులు కలెక్టరేట్‌లకు తరలివస్తున్నారు.



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న వివేక్ వెంకటస్వామి

రిజర్వేషన్లతో ఆర్థికంగా ఎదగాలి

చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

నారాయణఖేడ్: రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను సద్వినియోగం చేసుకొని ఉద్యోగ, ఆర్థిక, రాజకీయంగా ఎదగాలని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. గురువారం మనూరు మండలం కమలాపూర్‌లో దళిత రాష్ట్ర నేత నల్లా సూర్యప్రకాశ్ సహకారంతో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిమ్న వర్గాలు ఐక్యంగా ఉంటూ అభివృద్ధి సాధించాలని సూచించారు. ప్రతీ ఒక్కరూ అంబేడ్కర్ చూపిన దారిలో నడుస్తూ సమాజాభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. ఎమెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ.. బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ పాటుపడిందన్నారు. పేదలకు సబ్సిడీపై ఇచ్చే బియ్యం నేడు దళారీలు కొనుగోలు చేసి మిల్లర్లకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి రాకేష్ షెట్కార్, జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ గుర్రపు మచ్చేందర్, రాష్ట్ర ఆత్మకమిటీ మాజీ డైరెక్టర్ మారుతి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగిరం చేయాలి

- కలెక్టర్ వల్లూరు క్రాంతి
- రూ.25 కోట్లతో సీఎస్‌ఆర్ నిధులు వినియోగం
- పనుల పురోగతిపై సమీక్ష

సంగారెడ్డి జోన్: కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్‌ఆర్) నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి స్పష్టం చేశారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో గురువారం సీఎస్ఆర్ నిధుల వినియోగం, పనుల పురోగతిపై కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...జిల్లాలో సీఎస్‌ఆర్ నిధులతో ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులు, అంగన్‌వాడీ కేంద్రాలలో మౌలిక వసతుల మెరుగు కోసం వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. 2024- 25 ఆర్థిక ఏడాదిలో జిల్లాలో రూ.25 కోట్ల సీఎస్ఆర్ నిధులతో వివిధ అభివృద్ధి పనులు పూర్తి చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. జిల్లా సమగ్ర అభివృద్ధికి జిల్లాలోని పరిశ్రమల యజమానులు సహకరించాలని కోరారు. పరిశ్రమల యజమాన్యాల సహకారంతో జిల్లాలో 2025-26 ఏడాదికి సంబంధించి సీఎస్ఆర్ నిధుల వినియోగాన్ని మరింత ప్రణాళికాబద్ధంగా చేయాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

పెట్రోల్ బంకుల ఏర్పాటుకు చర్యలు: లోకేశ్‌కుమార్

మహిళా సంఘాల ద్వారా పెట్రోల్ బంకులను ఏర్పాటుకు అనువైన భూములు గుర్తించాలని రాష్ట్ర పంచాయతి రాజ్ కార్యదర్శి లోకేశ్‌కుమార్ అధికారులకు సూచించారు. సంగారెడ్డి జిల్లాలో మహిళా సంఘాలకు పెట్రోల్ బంక్ కేటాయించడం రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచిందని, అదేవిధంగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో భూ సేకరణ చేపట్టాలని అధికారులకు ఆయన తెలిపారు. మహిళలు చేపట్టే పెట్రోల్ బంక్‌లలో ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్ స్టేషన్, పిల్లలు ఆడుకునేందుకు ఆట స్థలం, క్యాంటీన్, చిన్న హోటల్ ఏర్పాటు చేసేందుకు వీలుగా ఉండాలని స్పష్టం చేశారు. సమావేశంలో డీఆర్‌డీఏ జ్యోతి, పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ రాజేశ్వర్, డీఈఓ తదితరులు పాల్గొన్నారు.

నిమ్జ్ పనులు వేగవంతం చేయండి

అసెంబ్లీలో ఎమ్మెల్యే మాణిక్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్: నియోజకవర్గంలో గతంలో ఏర్పడిన జాతీయ పెట్టుబడుల ఉత్పాదక మండలి (నిమ్జ్) ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని గురువారం ఎమ్మెల్యే మాణిక్‌రావు అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరారు. 2011లో నిమ్జ్ ప్రాజెక్టు పనులను ప్రారంభించారన్నారు. అయినా ఇప్పటి వరకు ఎటువంటి పనులు కూడా ముందుకు సాగడం లేదన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ప్రాజెక్టును పూర్తి చేయడం ద్వారా జహీరాబాద్ నియోజకవర్గం ప్రజలకు ఉపాధి లభించనుందన్నారు.

భారతినగర్ డివిజన్‌లో జోనల్ కమిషనర్ పర్యటన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతినగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి గురువారం పర్యటించారు. బొంబాయి కాలనీలోని రైతు బజారు నిర్మాణ పనులను పరిశీలించారు. పార్కింగ్ వాల్‌కు గ్రిల్స్ ప్రతిపాదనలు పంపాలని అధికారులకు సూచించారు. పనులను వేగవంతం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మాక్స్ సొసైటీ కాలనీకి వెళ్లే మార్గంలో రోడ్డుకు ఇరువైపులా వేసిన చెత్తను పరిశీలించారు.

ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహం

జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్

జహీరాబాద్: ప్రకృతి, సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్ అన్నారు. గురువారం మండలంలోని దిడిగి గ్రామ శివారులో గల డీడీఎస్- కేవీకే ఆధ్వర్యంలో చిరుధాన్యాల సాగుపై రైతులకు నిర్వహించిన అవగాహన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వ్యవసాయ శాఖ మద్దతుతో అధిక దిగుబడులను ఇచ్చే విత్తనాల వినియోగం, శాస్త్రీయ వ్యవసాయ విధానాల అనుసరణ ద్వారా రైతులు మరింత లాభదాయకంగా వ్యవసాయం చేయగలరని సూచించారు. కేవీకే ద్వారా రైతులకు శాస్త్రీయ అవగాహన కల్పించడంపై ప్రశంసించారు. జహీరాబాద్ ప్రాంతంలో పప్పు ధాన్యాలు, నూనెగింజల సాగుపై మెరుగైన అవగాహన కల్పించడానికి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఎస్సీ కార్పొరేషన్ కార్యనిర్వహణ అధికారి రామచారి మాట్లాడుతూ.. షెడ్యూల్డ్ కులాల కోసం రాజీవ్ యువ వికాస్ పథకం ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ పథకం కింద రెండు గేదెలు లేదా ఇతర వ్యాపారాలను ప్రారంభించేందుకు 90 శాతం సబ్సిడీ, 10 శాతం బ్యాంకు రుణం అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ భిక్షపతి, కేవీకే శాస్త్రవేత్తలు వరప్రసాద్, రమేష్, శైలజ, స్నేహలత, కైలాష్, సాయి ప్రియాంక, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శివప్రసాద్

డంపింగ్ యార్డ్ రద్దు చేయాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్కా రాములు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: ప్రజా వ్యతిరేకమైన ప్యారానగర్ డంపింగ్ యార్డ్ రద్దు చేయాల్సిందేనని, రేవంత్‌రెడ్డి సర్కార్ ప్రజా ప్రభుత్వం అంటూనే ప్రజల గోడు పట్టించుకోరా అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్కా రాములు ప్రశ్నించారు. ప్యారానగర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాటానికి మద్దతుగా గురువారం సీపీఎం సామూహిక నిరహార దీక్షలను ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్కా రాములు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రజా ఉద్యమాలను నిర్బంధాలతో అణచివేయాలని చూస్తే ప్రజలు మరింత తిరగబడతారని హెచ్చరించారు. స్థానిక ప్రజల అభిప్రాయాలకు భిన్నంగా ఏకపక్షంగా డంపింగ్ యార్డ్ పెట్టాలని నిర్ణయించడం సరైంది కాదన్నారు. డంపింగ్ యార్డ్‌ను రద్దు చేయాలని కోరుతూ ప్రజలు పోరాడుతున్నందున వాస్తవ పరిస్థితులను గమనించి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాల్సిన బాధ్యత కలెక్టర్‌పై ఉందన్నారు. ఇప్పటికే పరిశ్రమలు వెదజల్లే కాలుష్యం వల్ల జిన్నారం, బొంతపల్లి,పటాన్‌చెరు ప్రాంతమంతా పరిసరాలు, పర్యావరణం దెబ్బతినడం వల్ల అక్కడ ప్రజలు జీవించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం డంపింగ్ యార్డును రద్దు చేయాలని కోరుతూ కలెక్టరేట్ ఏఓకు వినతి పత్రం అందజేశారు.



మాట్లాడుతున్న చుక్కా రాములు

• దుర్గంధం



సంగారెడ్డి మున్సిపాలిటీలోని పారిశుద్ధ్య కార్మికులు శుభ్రం చేయకపోవడంతో పోతిరెడ్డిపల్లి చౌరస్తా గల్లీలోని డ్రైనేజీ పూర్తిగా నిండిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సర్వే రెమ్యూనరేషన్ చెల్లించాలి

టీపీటీఎఫ్ డిమాండ్

సంగారెడ్డి ఎడ్యుకేషన్: సమగ్ర కుటుంబ సర్వే విధుల్లో పాల్గొన్న సిబ్బందికి తక్షణమే సర్వే రెమ్యూనరేషన్ చెల్లించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సంగారెడ్డిలోని కలెక్టరేట్ వద్ద టీపీటీఎఫ్ నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సోమశేఖర్ మాట్లాడుతూ...గతేడాది నవంబర్‌లో ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో ఉపాధ్యాయులు, ఇతర శాఖల ఉద్యోగులకు రూ.10 వేల రెమ్యూనరేషన్ ప్రకటించిందన్నారు. 15 రోజుల్లోనే సర్వే పూర్తి చేసి ఇచ్చినా ఇప్పటివరకు వారికి ఆ మొత్తాన్ని చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నడూ లేని విధంగా ఏకంగా ఐదు డీఏలను పెండింగ్‌లో పెట్టడం సమంజసం కాదని, గతేడాది నుంచి పెండింగ్‌లో ఉన్న జీపీఎఫ్‌తోపాటు ఇతర పెండింగ్ బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్ ఏఓ పరమేశ్వర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచందర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మయ్య యాదవ్, రాష్ట్ర కౌన్సిలర్లు సంజీవయ్య సుభాష్ బాబు, భాస్కర్, కమ్రుద్దీన్, జిల్లా ఉపాధ్యక్షుడు నాసర్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఏఓ పరమేశ్వర్‌కు వినతి పత్రం అందజేస్తున్న టీపీటీఎఫ్ నాయకులు

మిగిలింది మూడు రోజులే!

- వందశాతం వసూలు అనుమానమే!
- ఇప్పటివరకు రూ.5.90 కోట్లు వసూలు
- ఆస్తిపన్ను చెల్లించాలంటున్న అధికారులు

జహీరాబాద్‌టౌన్: జహీరాబాద్ మున్సిపల్‌కు ఇచ్చిన ఆస్తి పన్ను వసూలు గడువు ఇంకా మూడురోజులే ఉంది. ఇప్పటివరకు రూ.5.90 కోట్లు వసూలు చేయగా ఇంకా రూ.11 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. గడువు దగ్గర పడుతుండటంతో వంద శాతం పన్ను వసూలు అనుమానంగా ఉంది. మార్చి 31తో నిర్దేశించిన గడువు ముగిస్తుండటంతో పన్ను వసూల్‌కు అధికారులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు.

జహీరాబాద్ మున్సిపల్ పరిధిలో 37 వార్డులున్నాయి. లక్షకు పైగా జనాభా కలిగిన మున్సిపాలిటీలో ఇళ్లు, వ్యాపార సంస్థలు 29,000 పైగా ఉన్నాయి. పట్టణ విస్తీర్ణంతోపాటు ప్రతీ ఏటా నూతన నిర్మాణాలు కూడా పెరుగుతున్నాయి. దీంతో ప్రతి ఏడాది ఆస్తి పన్ను కూడా పెరుగుతుంది. ఇళ్లు, వ్యాపార సంస్థలతో పాటు ప్రభుత్వ కార్యాలయాలు కలిపి 2024-25 ఆర్థిక ఏడాదికి మున్సిపల్‌కు ఇంటి పన్ను రూ.17 కోట్లు డిమాండ్ ఉంది.



జహీరాబాద్ మున్సిపల్ కార్యాలయం

పది బృందాల ఏర్పాటు

ఇంటి పన్ను వసూలుకు మున్సిపల్ కమిషనర్ ప్రత్యేక ప్రణాళికలు చేపట్టారు. బిల్‌కలెక్టర్‌లు కలుపుకుని 10 బృందాలను ఏర్పాటు చేశారు. ఒక్కొక్క టీంలో ముగ్గురు సభ్యులు ఉంటారు. ఏరియాను బట్టి టార్గెట్‌ను నిర్దేశించి అధికారులు వసూళ్లకు పంపుతున్నారు. ప్రచార వాహనాన్ని ఏర్పాటు చేసి ప్రతీరోజు పట్టణంలో తిప్పుతున్నారు. అయినా ఆశించిన మేరకు ఆస్తి పన్ను వసూలు కావడంలేదు. గడువు ఇంకా మూడు రోజులే మిగిలి ఉన్నందున వందశాతం వసూలు అసాధ్యమంటున్నారు. మొండి బకాయిలు సైతం పేరుకుపోయాయి. వాటిని వసూల్ చేసేందుకు మున్సిపల్ అధికారులు వడ్డీలో 90 శాతం రాయితీ ప్రకటించారు. వడ్డీలో కేవలం పదిశాతం చెల్లించేందుకు అవకాశం కల్పించారు. అయినా ఇప్పటి లక్ష్యం అధిగమించడం అనుమానంగా ఉంది.

ప్రయత్నాలు చేస్తున్నాం

ఆస్తి(ఇంటి) పన్ను వసూలుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నాం. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. ప్రచారం వాహనంతో ప్రతీ రోజు పట్టణంలో చాటింపు వేయిస్తున్నాం. ప్రజలు కూడా పూర్తిగా సహకరించి ఆస్తిపన్ను చెల్లించాలి. మొండు బకాయిలు కల్గిన వారికి 90% వడ్డీలో రాయితీ ఇచ్చాం. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని 31 లోగా పూర్తి బిల్లులు చెల్లించాలి.

–ఉమా మహేశ్వర్, మున్సిపల్ కమిషనర్, జహీరాబాద్

క్లుప్తంగా

జాతీయస్థాయి సైక్లింగ్ పోటీలకు సిద్దిపేట విద్యార్థి

అక్కన్నపేట(హుస్నాబాద్): జాతీయస్థాయి మౌంటెన్ సైక్లింగ్ పోటీలకు సిద్దిపేటకు చెందిన భూక్య ప్రసాద్ ఎంపికైనట్లు జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బండారుపల్లి శ్రీనివాస్, జంగపల్లి వెంకటనర్సయ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 7,8,9 తేదీల్లో రంగారెడ్డి జిల్లా కోహెడ సంఘీలో జరిగిన రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీల్లో పాల్గొన్న ప్రసాద్ అత్యంత ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. హర్యానా రాష్ట్రంలోని పంచకులలో 29 నుంచి నాలుగు రోజుల పాటు జరిగితే తొమ్మిదవ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనున్నట్లు తెలిపారు. ప్రసాద్‌ను క్రీడా సంఘాలు, పీఈటీలు కాటం శ్రీను, ఉప్పాలయ్య, అశోక్, రామేశ్వర్‌రెడ్డి, సుజాత తదితరులు అభినందించారు.

పోలీసులమని బెదిరించి రూ.26 వేలు లూటీ

సైబర్ మోసగాళ్ల వలలో వలస కూలీ

మద్దూరు(హుస్నాబాద్): మేము పోలీసులం మాట్లాడుతున్నాం.. నీ పైన ఓ కేసు నమోదైంది. తీసి వేయాలంటే వెంటనే ఫోన్ నంబర్‌కు డబ్బులు పంపుమని ఓ సైబర్ మోసగాడు వలస కూలీకి ఫోన్ చేసి డబ్బులు కాజేశాడు. ఈ ఘటన మండలంలోని నర్సయపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన కుమార్ అనే మేస్త్రీ వద్ద మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన నలుగురు కూలీలుగా పని చేస్తున్నారు. ఇందులో ఒకరైన వినోద్‌కు గురువారం ఉదయం 96856 95940 నంబర్‌తో ఓ అపరిచిత వ్యక్తి ఫోన్ చేశాడు. తాను పోలీస్‌ని మాట్లాడుతూన్నానని, నీపై కేసు నమోదైనట్లు తెలిపారు. కేసును తీసివేయాలంటే ఈ నంబర్‌కు రూ.50వేలు పంపాలని బెదిరించాడు. భయాందోళనకు గురైన వినోద్ పేటీఎం ద్వారా రూ.26 వేలు పంపించాడు. ఈ విషయన్ని స్నేహితులకు తెలుపగా వారు సదరు నంబర్‌కు కాల్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. తాను మోసపోయామని గ్రహించి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ఆలయ ఉద్యోగిపై ఔట్‌సోర్సింగ్ సిబ్బంది దాడి

కొమురవెల్లిలో ఇద్దరిపై కేసు

కొమురవెల్లి(సిద్దిపేట): ఆలయ ఉద్యోగిపై ఔట్ సోర్సింగ్ సిబ్బంది దాడి చేసిన ఘటన కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో చోటు చేసుకుంది. గురువారం ఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. కొమురవెల్లి మల్లన్న ఆలయంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్‌గా సార్ల విజయ్ కుమార్ విధులు నిర్వహిస్తున్నాడు. ఆ సమయంలో ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఆరెళ్ల మహేశ్, ఎక్కలదేవి వినయ్ వారికి తెలిసిన కొంత మంది భక్తులను దర్శనం కోసం వెనుక మెట్ల గుండా తీసుకొచ్చారు. దీంతో విజయ్ కుమార్ దర్శనానికి ముందు నుంచి రావాలని సూచించాడు. ఈ క్రమంలో వారి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. మాటామాట పెరిగి మహేశ్, వినయ్ విజయ్‌కుమార్‌పై దాడికి పాల్పడటంతో స్వల్పగాయాలు అయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్ఐ తెలిపారు.

యువకుడు అదృశ్యం

మనోహరాబాద్(తూప్రాన్): యువకుడు అదృశ్యమైన ఘటన మండలంలోని రంగాయపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గురువారం ఎస్ఐ సుభాష్‌గౌడ్ కథనం మేరకు.. రంగాయపల్లికి చెందిన మన్నె అజయ్‌కుమార్(27) బుధవారం ఇంట్లోంచి బయటకు వెళ్లాడు. గ్రామ శివారులోని చింతలకుంట చెరువు కట్ట వద్ద బట్టలు, చెప్పులున్నాయని స్థానికులు చెప్పడంతో కుటుంబీకులు చెరువులో ఈతగాళ్లతో వెతికించారు. గురువారం సైతం చెరువు వద్ద గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభ్యం కాలేదు. అజయ్‌కుమార్ అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రైతులకు 'గుర్తింపు'

ప్రతీ పౌరుడికి ఆధార్ గుర్తింపు కార్డు మాదిరిగానే, ప్రతీ రైతుకు కూడా ప్రత్యేక గుర్తింపు కార్డు ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ×ఫార్మర్ రిజిస్ట్రీ× పేరుతో ప్రతీ రైతుకు 11 అంకెల విశిష్ట సంఖ్య కేటాయించనున్నారు. రాష్ట్రంలో ఇందు కోసం నాలుగు జిల్లాలను ఎంపిక చేయగా, సంగారెడ్డి జిల్లాలోని మండల కేంద్రమైన మొగుడంపల్లి రెవెన్యూ గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టేందుకు వీలుగా ఇటీవల ఏడీఏ భిక్షపతి వ్యవసాయ శాఖ సిబ్బందితో అవగాహన సమావేశం నిర్వహించారు. ఏప్రిల్ మొదటి వారంలో నమోదు ప్రక్రియను మొదలుపెట్టే అవకాశం ఉంది.

– జహీరాబాద్

- ప్రత్యేక కార్డుల జారీకి ప్రభుత్వం చర్యలు
- ఆధార్ తరహాలో 11 అంకెల సాగుదారుల సంఖ్య
- రైతులకు సంబంధించి ప్రతీ పనికి ఈ కార్డు ఉపయోగం
- మొగుడంపల్లి రెవెన్యూ గ్రామం పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక
- ఏప్రిల్ మొదటి వారం నుంచి శ్రీకారం
- నమోదు ప్రక్రియకు ప్రత్యేక యాప్



మొగుడంపల్లి రైతు వేదిక

రైతులకు గుర్తింపు కార్డును ఇచ్చేందుకు వీలుగా ప్రత్యేక యాప్ ద్వారా పేర్లు నమోదు చేయనున్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు అమలు చేసేందుకు వీలుగా దేశ వ్యాప్తంగా ప్రత్యేక యాప్ ద్వారా ఆధార్ కార్డు మాదిరిగా రైతులకు ప్రత్యేక కోడ్ ఉండాలనే ఉద్దేశ్యంతో సాగుదారుల సంఖ్యను ఇవ్వనున్నారు. ఇప్పటికే పలు రాష్ట్రాల్లో ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. పీఎం కిసాన్, క్రాప్ లోన్, పంటల బీమా, యాంత్రీకరణ పరికరాలతోపాటు తదితర పథకాలను సాగుదారుల సంఖ్య ఆధారంగా అందిస్తారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా నిధులు అందే రైతుల పథకాలు అమలు చేసేందుకు గాను ఇది ఉపయోగపడుతుంది. బ్యాంకులకు రుణాల కోసం వెళ్తే పట్టాదార్ పాసుపుస్తకం అవసరం లేకుండానే సాగుదారుల సంఖ్య కార్డును తీసుకెళ్తే సరిపోతుంది. కార్డు ద్వారా భూమికి సంబంధించిన పూర్తి సమాచారం తెలిసిపోతుంది. ధాన్యం కొనుగోళ్లకు సైతం ఇదే కార్డును వర్తింపజేయనున్నారు.

రెవెన్యూ గ్రామం పరిధిలో 9 తండాలు

మొగుడంపల్లి రెవెన్యూ గ్రామం పరిధిలో గ్రామంతోపాటు మరో తొమ్మిది తండాలు ఉన్నాయి. గ్రామంతోపాటు ఆయా తండాలకు సంబంధించిన రైతులు 4,123 మంది ఉన్నారు. గ్రామం పరిధిలో సుమారు 10 వేల ఎకరాలకు పైగా వ్యవసాయ భూమి ఉంది. మొగుడంపల్లి రెవెన్యూ గ్రామం కింద పరిసరాల్లో ఉన్న పడియాల్‌తండా, విఠునాయక్‌తండా, మిర్జంపల్లితండా, లేతమామిడి తండా, మందగుబ్బడి తండా, నందునాయక్ తండా, హరిచంద్‌నాయక్‌తండా, చున్నంబట్టితండా, జాంగార్‌బౌలి తండాల రైతాంగానికి ఆధార్‌కార్డు తరహాలో పైలెట్ ప్రాజెక్టు కింద 11 అంకెల సాగుదారుల సంఖ్య పొందుపర్చిన కార్డులను ఇవ్వనున్నారు.

తగిన సమాచారంతో నమోదుకు వెళ్లాలి

రైతులకు అందించనున్న సాగుదారుల సంఖ్య కార్డు నమోదు కోసం తగిన సమాచారంతో వెళ్లాలి. మొగుడంపల్లి రైతు వేదికలో ప్రత్యేక యాప్‌ద్వారా నమోదు చేస్తారు. ఆధార్‌కార్డు లింకు ఉన్న సెల్ ఫోన్ నంబరు, ఆధార్‌కార్డు, పట్టాదారు పాసు పుస్తకం తీసుకెళ్లాలి. వ్యవసాయ సిబ్బంది ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేస్తారు. అనంతరం రైతు సెల్‌ఫోన్‌కు ఓటీపీ వస్తుంది. ఈ నంబర్‌ను సిబ్బందికి చెబితే 11 అంకెల ప్రత్యేక గుర్తింపు కార్డు సంఖ్యను కేటాయిస్తారు. అందుబాటులో లేని రైతులు ఫోన్‌లో అధికారులను సంప్రదించి పూర్తి వివరాలు చెబితే ప్రత్యేక నంబరును కేటాయిస్తారు.

ప్రభుత్వ పథకాలకు దోహదం



ప్రభుత్వం ఇచ్చే పథకాలకు సాగుదారుల సంఖ్య ఎంతగానో ఉపయోగపడుతుంది. పట్టాదారు పాసు పుస్తకం లేకున్నా ప్రతీ పనికి తాము జారీ చేసే కార్డును తీసుకెళ్తే సరిపోతుంది. ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను ప్రణాళికా బద్ధంగా పూర్తి చేయనున్నాం. వివరాల నమోదు కోసం ప్రత్యేక యాప్ అందుబాటులోకి రానుంది. యాప్ రాగానే నమోదు ప్రక్రియను మొదలుపెడతాం. మొగుడంపల్లి నుంచి ప్రారంభించి పరిసరాల్లో ఉన్న తండాల్లో కొనసాగిస్తాం. జిల్లాలోనే మొగుడంపల్లిని పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు.

–భిక్షపతి,జహీరాబాద్ ఏడీఏ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎం రఘు, సిబ్బంది

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు

సిద్దిపేట ఆర్టీసీ డిపో మేనేజర్ టీ.రఘు

సిద్దిపేటకమాన్: ప్రయాణికులకు ఆర్టీసీ ద్వారా మెరుగైన సౌకర్యాలు అందిస్తామని సిద్దిపేట డిపో మేనేజర్ టీ.రఘు తెలిపారు. సిద్దిపేట డిపో నూతన మేనేజర్‌గా బదిలీపై వచ్చి ఆయన ఇటీవల బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. 30 ఏళ్లుగా ఆర్టీసీలో పని చేసిన అనుభవం ఉందని, భూపాలపల్లి, యాదగిరిగుట్ట, హయత్‌నగర్, కాచిగూడ డిపోల్లో మేనేజర్‌గా పని చేసినట్లు తెలిపారు. సిద్దిపేట జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని, రాజకీయంగా చైతన్యవంతమైన జిల్లా అని అన్నారు. సిద్దిపేట, దుబ్బాక డిపోల్లో సుమారు 500 మంది సిబ్బంది, ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందరి సహకారం, సమిష్టి కృషితో రెండు డిపోలను లాభాల బాటలో తీసుకెళ్తానన్నారు.

రూ.151 కే భద్రాద్రి తలంబ్రాలు ఇంటికి

శ్రీరామ నవమి సందర్భంగా ఆర్టీసీ కార్గో సేవల ద్వారా భద్రాద్రి సీతారామచంద్ర స్వామి కల్యాణ తలంబ్రాలను ఇంటి వద్దకు పంపించడం జరుగుతుందని డీఎం తెలిపారు. రూ.151 డబ్బులు చెల్లిస్తే కార్గో ద్వారా ఇంటి వద్దకే తమ సిబ్బంది స్వామి వారి తలంబ్రాలు పంపిస్తారని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను డిపో సిబ్బందితో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది మౌలానా, తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికా బద్ధంగా ముందుకెళ్లాలి

జాతీయ సదస్సులో విద్యార్థులకు వక్తల సూచన



మాట్లాడుతున్న ప్రొఫెసర్ శివారెడ్డి

సిద్దిపేటఎడ్యుకేషన్: విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకొని వాటిని సాధించేందుకు ప్రణాళికా బద్ధంగా ముందుకెళ్లాలని వక్తలు పిలుపునిచ్చారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన రెండ్రోజుల జాతీయ సదస్సు గురువారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్ శివారెడ్డి హాజరై మాట్లాడారు. విద్య ద్వారానే సామాజిక అభివృద్ధి జరుగుతుందన్నారు. అట్టడుగు వర్గాల ప్రజలు తమ పిల్లలను తప్పనిసరిగా ఉన్నత విద్య చదివించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ చదువుకుంటే అసమానతలు తొలగుతాయన్నారు. ప్రభుత్వం విద్యారంగానికి సరిపడా బడ్జెట్ కేటాయింపులు ఉండేలా చూసుకోవాలన్నారు. బీసీ కమిషన్ మెంబర్ బాల్‌లక్ష్మి మాట్లాడుతూ.. అట్టడుగు వర్గాల ప్రజలకు నాణ్యమైన విద్య, నాణ్యమైన ఆరోగ్యాన్ని ప్రభుత్వాలు అందించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత, సెమినార్ కన్వీనర్ డాక్టర్ శ్రద్ధానందం మాట్లాడుతూ ఇలాంటి సదస్సులు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతాయని వాటిని సద్వినియోగం చేసుకొని అభివృద్ధి దిశగా రాణించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ హుస్సేన్, డాక్టర్ రవినాథ్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ అయోధ్యరెడ్డి, సీఓఈ డాక్టర్ గోపాలసుదర్శనం తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



పొలం వద్ద లోకేందర్ మృతదేహం

- పొలం వద్ద గడ్డి కోస్తుండగా ప్రమాదం
- తొగుట మండలం ఎల్లారెడ్డిపేటలో ఘటన

తొగుట(దుబ్బాక): విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన ఘటన మండలంలోని ఎల్లారెడ్డిపేటలో గురువారం ఉదయం చోటు చేసుకుంది. కుటుంబీకులు, గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన మన్నె లోకేందర్ (39) తనకున్న ఎకరం పొలంతోపాటు సిద్దిపేట పట్టణ వ్యాపారవేత్తకు చెందిన నాలుగు ఎకరాల భూమిని నాలుగేళ్లుగా కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. రోజూ మాదిరిగా గురువారం ఉదయం పొలం వద్దకు వెళ్లి పొలం గట్లపై ఏపుగా పెరిగిన గడ్డిని కోస్తున్నాడు. ఈ క్రమంలో బోరుమోటార్‌కు సమీపంలోకి వెళ్లి గడ్డి కోస్తుండగా కరెంట్ షాక్ కొట్టి కింద పడిపోయాడు. అక్కడే చుట్టుపక్క ఉన్న అన్న పోచయ్య, సమీప రైతులు వచ్చిచూడగా మృతి చెంది ఉన్నాడు. మృతుడికి భార్య శైలజ, కుమారులు ఆదికైలాష్ (5), వాసుదేవ్ (3), వృద్ధురాలైన తల్లి ఉన్నారు. శైలజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు స్టేషన్ హౌజ్ ఆఫీసర్ అనిల్ తెలిపారు. ఉదయం 5 గంటలకు నిద్రలేచి ఇంటి పనులు చేస్తుండగా పొలం వద్దకు వెళ్లొస్తానంటూ చెప్పి తిరిగిరాని లోకాలకు పోయావా అంటూ లోకేందర్ భార్య శైలజ కన్నీరుమున్నీరుగా విలపించడం అందరనీ కంటతడి పెట్టించింది.

చెన్నాపూర్ గ్రామంలో వ్యక్తి



సుధాకర్‌రెడ్డి మృతదేహం

శివ్వంపేట(నర్సాపూర్) : విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధి చెన్నాపూర్ గ్రామంలో గురువారం సాయత్రం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన సింగిరెడ్డి సుధాకర్‌రెడ్డి(45) గ్రామంలో ఇంటి నిర్మాణం చేపడుతున్నాడు. శివారు పనులు చేసేందుకుగాను తడకలు సరిచేస్తుండగా ఇంటికి దగ్గరగా ఉన్న విద్యుత్ వైరు తగిలి కరెంట్ షాక్‌తో మృతి చెందాడు.

మృతదేహంతో రాస్తారోకో : విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యం వల్లనే ప్రమాదం జరిగిందని మృతదేహంతో గోమారం- చిన్నగొట్టిముక్ల ప్రధాన రోడ్డుపై కుటుంబ సభ్యులు, గ్రామస్తులు రాస్తారోకో చేశారు. సిబ్బంది పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ మధుకర్‌రెడ్డి విద్యుత్ సిబ్బందితో ఫోన్ మాట్లాడారు. బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి



అనిల్‌గౌడ్ (ఫైల్)

ములుగు(గజ్వేల్) : ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన ములుగు మండలం కొక్కొండ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ విజయ్‌కుమార్ కథనం మేరకు..గ్రామానికి చెందిన ఆశెల్లి అనిల్‌గౌడ్(30) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తుండేవాడు. 26న సొంత ఆటో నడుపుతూ మండలంలోని బస్వాపూర్ నుంచి కొత్తూర్ వైపు వెళ్తున్నాడు. మార్గమధ్యలో నోవా కంపెనీ సమీంపలోకి రాగానే ఆటో అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. పక్కనే ఉన్న కాల్వలో పడటంతో అనిల్‌గౌడ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే లక్ష్మక్కపల్లి ఆర్‌వీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం తెల్లవారు జామున మృతి చెందాడు. మృతుడి చిన్ననాన్న నాగులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ



పోచమ్మ(ఫైల్)

టేక్మాల్(మెదక్): అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందిన ఘటన మండల కేంద్రమైన టేక్మాల్‌లో గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ రాజేశ్ కథనం మేరకు.. టేక్మాల్ గ్రామానికి చెందిన చింత పోచమ్మ(40) కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తుంది. నిత్యం మాదిరిగానే 26న సాయంత్రం కల్లు తాగేందుకు ఇంటి నుంచి వెళ్లింది. రాత్రి అయినా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికారు. గ్రామానికి చెందిన తిమ్మిగారి మధుసూదన్ పోచమ్మ కట్టెల మిషన్ వైపు వెళ్లినట్లు చెప్పడంతో అటువైపు వెళ్లి చూడగా మృతదేహం కనిపించింది. మృతురాలి కూతురు జ్యోతిక ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేశ్ తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం

పోలీసుల అదుపులో నిందితుడు

కొండపాక(గజ్వేల్): అంబేడ్కర్ విగ్రహాన్ని పాక్షికంగా ధ్వంసం చేసిన వ్యక్తిని కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన కొండపాక మండలంలోని దమ్మక్కపల్లి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ కథనం మేరకు.. దమ్మక్కపల్లి గ్రామంలో కొన్ని నెలల కిందట అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు కానీ ఆవిష్కరణ చేయలేదు. ఈ క్రమంలో జింక తిరుపతి అనే వ్యక్తి విగ్రహ గద్దెపై కూర్చొని కట్టెతో చేయిపై కొట్టడంతో పాక్షికంగా దెబ్బతింది. స్థానికులు విషయం పోలీసులకు చెప్పడంతో ఎస్సై శ్రీనివాస్ విగ్రహాన్ని పరిశీలించారు. వివరాలు సేకరించి గ్రామంలో ఎలాంటి గొడవలు తలెత్తకుండా విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.



దెబ్బతిన్న విగ్రహం చేయి

లైంగిక దాడి.. ఆపై హత్య

- మహిళ హత్య కేసును ఛేదించిన జోగిపేట పోలీసులు
- తిట్టిందని కక్ష పెంచుకొని గొంతునులిమి చంపిన నిందితుడు
- అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ అనిల్‌కుమార్

వట్‌పల్లి(అందోల్): మద్యం మత్తులో ఓ మహిళపై లైంగికదాడి చేసి హత్య చేసిన కేసును పోలీసులు ఛేదించారు. గురువారం జోగిపేట సీఐ అనిల్‌కుమార్ కేసు వివరాలు వెల్లడించారు. ఖాదిరాబాద్ గ్రామానికి చెందిన బుసిరెడ్డిపల్లి కిషన్ 11వ తేదీన ఉదయం ఇంటి వద్ద గ్రామానికి చెందిన మరో మహిళతో మాట్లాడుతుండగా అదే గ్రామానికి చెందిన గౌరమ్మ(40) తిట్టింది. దీన్ని మనసులో పెట్టుకున్న కిషన్ అదే రోజు రాత్రి 10.30 గంటల సమయంలో గౌరమ్మ ఇంట్లో ఒంటరిగా నిద్రిస్తుండగా లోనికి వెళ్లాడు. నన్ను ఎందుకు తిట్టావ్ అని కిషన్ ప్రశ్నించగా రాత్రిపూట నా ఇంటికి వస్తావా అంటూ మహిళ బెదిరించింది. మద్యం మత్తులో ఉన్న కిషన్ ఆమెను శారీరకంగా అనుభవించాడు. అనంతరం గౌరమ్మ పెద్ద మనుషులకు చెప్పి పంచాయితీ పెట్టి పోలీసు కేసు పెడతానని అతడిని బెదిరించింది. వెంటనే కోపోద్రేకుడైన కిషన్ ఆమె గొంతు నులిమి హత్య చేశాడు. మృతురాలి ఒంటిపై ఉన్న బంగారు, వెండి వస్తువులు తీసుకున్నాడు. సాక్ష్యం లేకుండా చేసేందుకు గాను కారంపొడి చల్లి మంచాన్ని తగులబెట్టి ఆ మంటల్లో కాలిపోతుందనుకొని వెళ్లిపోయాడు. మరుసటి రోజు గౌరమ్మ మృతి వెలుగులోకి రాగా మృతురాలి సోదరుడు వీరేశం వట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు అనుమానితుడిగా కిషన్‌ను భావించి వెతుకుతుండగా గ్రామంలో లేడు. గురువారం గ్రామంలోని తన ఇంటికి వచ్చినట్లుగా సమాచారం తెలుసుకున్న పోలీసులు అరెస్టు చేసిన రిమాండ్‌కు తరలించారు. దొంగిలించబడిన వస్తువులను రికవరీ చేసినట్లు సీఐ తెలిపారు. మృతురాలి భర్త గతంలోనే చనిపోగా, కుమారుడు హైదరాబాద్‌లో నివాసముంటున్నాడు.

వేర్వేరు కారణాలతో నలుగురు ఆత్మహత్య



కమలేష్ యాదవ్(ఫైల్)

మనోహరాబాద్(తూప్రాన్): ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. గురువారం ఎస్ఐ సుభాష్ గౌడ్ కథనం మేరకు.. మండలంలోని కాళ్లకల్ గ్రామంలో కమలేష్‌యాదవ్ (25) వెల్డింగ్ పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. భార్య మమత, కుమారుడు, కూతురు ఉన్నారు. కమలేష్‌యాదవ్ తాగుడుకు బానిసయ్యాడు. బుధవారం రాత్రి బాగా తాగి ఇంట్లోంచి వెళ్లిపోయాడు. జీవితంపై విరక్తి చెంది గురువారం ఉద యం కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతకగా గ్రామ శివారులోని శ్మశానవాటిక పక్కన చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భర్త మృతిపై ఎలాంటి అనుమానం లేదని మృతుడి భార్య మమత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

భార్య మందలించడంతో భర్త..



కుమార్ (ఫైల్)

దుబ్బాకటౌన్ : తరచూ మద్యం సేవిస్తున్నావని భార్య మందలించడంతో ఉరేసుకొని భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన రాయపోల్ మండలం గొల్లపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గురువారం రాయపోల్ పోలీసుల కథనం మేరకు.. రాయపోల్ మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన ఎంకొల్ల కుమార్ (35) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తుండేవాడు. బుధవారం కుమార్ మద్యం సేవించి ఇంటికొచ్చాడు. భార్య మద్యం ఎందుకు తాగి వచ్చావని మందలించి, అమ్మమ్మగారి గ్రామం చేగుంట మండలం అన్నసాగర్ వెళ్లిపోయింది. భర్త కుమార్ అదే రోజు సాయంత్రం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య మహంకాళి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రఘుపతి తెలిపారు.

ఉరేసుకొని మహిళ

కంది(సంగారెడ్డి): ఉరేసుకొని మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల కేంద్రమైన కందిలో చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై రవీందర్ కథనం మేరకు.. కందికి చెందిన హేమంత్, హేమలత(34) దంపతులకు ఇద్దరు కుమారులు. హేమంత్ బుధవారం రాత్రి ఇంటికి రాగా భార్య తలుపులు తీయలేదు. దీంతో పగులగొట్టి చూడగా హేమలత చీరతో ఉరేసుకొని కనిపించింది. మృతురాలి తల్లి క్యాసారం అంజమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

శేఖాపూర్ తండాలో రైతు..

జహీరాబాద్ టౌన్: ఉరేసుకొని రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జహీరాబాద్ మండలంలోని శేఖాపూర్ తండాలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. తండాకు చెందిన కిషన్ నాయక్ పవార్(50)కు సొంత పొలం ఉండగా వ్యవసాయం పనులు చేసుకుంటున్నాడు. అప్పుల బాధ లేక చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ట్యాంకర్ కాలువలో పడి డ్రైవర్

చిన్నకోడూరు(సిద్దిపేట): వాటర్ ట్యాంకర్ కాలువలో బోల్తాపడి డ్రైవర్ మృతి చెందిన ఘటన మండల పరిధిలోని ఎల్లాయపల్లి శివారులో గురువారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. బిహార్‌కు చెందిన తుఫాన్ కుమార్(23) ఎల్లాయపల్లి శివారులో జరుగుతున్న అదనపు టీఎంసీ పంపు హౌస్ నిర్మాణ పనుల్లో వాటర్ ట్యాంకర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కమ్మర్లపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి కొత్తపల్లి వరకు రోడ్డుపై దుమ్ములేవకుండా వాటర్ ట్యాంకర్‌తో నీటిని పడుతాడు. ఎల్లాయపల్లి శివారులోని గేట్ల వద్ద ఉన్న కాలువ నుంచి ట్యాంకర్‌లోకి నీటిని నింపేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు ట్యాంకర్ అదుపుతప్పి కాలువలో బోల్తాపడింది. కుమార్‌ను సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు.

ఆర్టీసీ బస్సు, బైక్ ఢీ : కార్మికుడు మృతి

దుబ్బాక : ఆర్టీసీ బస్సు, బైక్ ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన దుబ్బాక పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్ఐ గంగరాజు కథనం మేరకు.. దుబ్బాక పట్టణంలోని హబ్షీపూర్ రోడ్‌లో గల ఓ బార్ సమీపంలో బుధవారం అర్ధరాత్రి ప్రైవేట్ ఆర్టీసీ బస్సు, బైక్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా దుబ్బాక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించగా గురువారం మృతి చెందాడు. మృతుడు ఒడిషాకు చెందిన దేవ(35) గా గుర్తించారు. మృతుడు దేవ ఓ బార్ అండ్ రెస్టారెంట్‌లో పని చేస్తూ విధులు ముగించుకొని ఇంటికెళ్తున్న క్రమంలో ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులు వస్తేనే పూర్తి సమాచారం తెలుస్తుందని ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ ఇద్దరు మృతి

సిద్దిపేటకమాన్: ఆర్థిక ఇబ్బందులతో పురుగుల మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రైతు మృతి చెందాడు. ఈ ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. వన్ టౌన్ సీఐ వాసుదేవరావు కథనం మేరకు.. తొగుట మండలం పెద్దమాసాన్‌పల్లి గ్రామానికి చెందిన గుమ్మడిదల వెంకట్‌కుమార్ (48) మూడేళ్ల కిందట పట్టణానికి వచ్చి స్థానిక భారత్‌నగర్‌లో కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. గ్రామంలో రెండు ఎకరాల పొలం ఎండిపోవడంతో పెట్టుబడి రాకపోవడం, ఆటో కోసం చేసిన అప్పులు, ఏడాది కిందట కూతురి వివాహం కోసం చేసిన అప్పులతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. దీంతో ఆదివారం వెంకట్ కుమార్ పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడి భార్య లత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అప్పుల బాధతో..

దుబ్బాకటౌన్ : ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఈ ఘటన రాయపోల్ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. రాయపోల్ మండల కేంద్రానికి చెందిన మహమ్మద్ షాదుల్లా (33) వాటర్ ప్లాంట్, చికెన్ సెంటర్ వ్యాపారం చేసుకుంటూ జీవిస్తున్నాడు. కొద్ది రోజుల కిందట షాదుల్లా ఇంటి నిర్మాణం కోసం బ్యాంకులో రూ.7 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. వ్యాపారం నడవకపోవడంతో నెల నెలా వాయిదాలు చెల్లించడం ఇబ్బందికరంగా మారింది. అప్పులు ఎలా చెల్లించాలని తరుచూ మదన పడుతుండేవాడు. మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి గ్రామ శివారులో పురుగుల మందు తాగి పడిపోయాడు. కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య మహమ్మద్ సల్మా బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రఘుపతి తెలిపారు.